క్లుప్తంగా

అబివృద్ధికి అందరూ సహకరించాలి

వెదురుకుప్పం: మండల అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎంపీపీ నాగరాణి అన్నారు. శుక్రవారం వెదురుకుప్పం మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ నాగరాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ సమస్యలను పలువురు సభ్యులు లేవనెత్తారు. సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఎంపీడీఓ పురుషోత్తం, ఏఓ వనిత, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విధుల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

శ్రీరంగరాజపురం: ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ మోహన్ మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మోహన్‌మురళి మాట్లాడుతూ మండలంలోని ఎగువ కమ్మకండ్రిగ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా వెంకటేష్ విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అతనిపై ప్రజాసమస్యల పరిష్కార వేదికలో గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో అధికారులు వెంకటేష్‌పై విచారణ నిర్వహించామన్నారు. ఈ విచారణలో వెంకటేష్ అవినీతికి పాల్పడినట్లు, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో శాశ్వతంగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారని తెలిపారు.

అవగాహనతో క్షయ వ్యాధి దూరం

గంగాధరనెల్లూరు: ప్రాణాంతకమైన క్షయ వ్యాధిని అవగాహనతో నిర్మూలించవచ్చని జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ అన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా జాతీయ టీబీ వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై శుక్రవారం మండలంలోని ముక్కకత్తూరు, కొట్రకోన, అగరమంగళం గ్రామాలలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లేని దేశంగా దేశం ఉండాలంటే ప్రతి ఒక్కరికి అవగాహన ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గురు ప్రకాష్, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది ధర్మేంద్ర, శైల తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: టీబీ నివారణపై అవగాహన పెంచుకుంటే వ్యాధి నయం చేసుకోవచ్చని జిల్లా టీబీ అధికారి వెంకట ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పాలసముద్రం పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి టీబీ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పీహెచ్‌సీలో అన్ని రికార్డులను తరవుగా పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సుశీల, మురళి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


పర్యావరణాన్ని పరిరక్షించాలి

పాలసముద్రం: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వినాయకం తెలిపారు. శుక్రవారం కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు కలసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వినాయకం మాట్లాడుతూ మొక్కలు నాటి పెంచడంతో వాతావరణ మార్పులు వస్తాయని తెలిపారు. చల్లనిగాలి వీస్తే వర్షాలు కురుస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పెంచాలని తెలిపారు. నాటిన మొక్కలకు మధ్యాహ్న భోజన విరామం సమయంలో నీరు పోసి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతులతో సాగు శ్రేయస్కరం

వెదురుకుప్పం: పంటల సాగులో రైతులు శాస్త్రీయ విధానాలను అనుసరించాలని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సుధాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుర్రంవారికండ్రిగ, గొడుగుచింత, పూల వారికండ్రిగ గ్రామాల్లో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త మంజునాథ మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే నేల ఆరోగ్యం బాగుండాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి రాజేష్, పట్టు పరిశ్రమ అధికారి రమేష్‌రెడ్డి, పశువైద్య సహాయకులు ప్రసాద్, సతీష్, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బలిబండి ఉత్సవం



కార్వేటినగరం: కొల్లాగుంట గ్రామంలో వెలసి ఉన్న శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం బలి బండి కూడు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బకాసురునికి బండి కూడు తీసుకువెళ్లి, భీముడు బకాసురుని సంహరించే ఘట్టాన్ని హరికథా భాగవతారిణి భారతి కథా కాలక్షేపం చేశారు. అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి పుర వీధుల్లో ఊరేగించారు. ఉభయదారులుగా కొల్లాగుంటకు చెందిన పద్మావతి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

మామిడికి దక్కని మద్దతు

- నష్టాల్లో మామిడి రైతులు
- ఓవైపు దిగుబడి లేక.. మరోవైపు గిట్టుబాటు ధర రాక అవస్థలు
- దళారులదే రాజ్యం



ట్రాక్టర్‌లో తరలుతున్న మార్కెట్‌కి మామిడి



పుత్తూరు మార్కెట్‌లో మామిడి

విజయపురం: ఆరుగాలం శ్రమించి పంటను నమ్ముకుంటున్న రైతులకు చివరకు నిరాశే మిగులుతోంది. ప్రకృతి వైపరీత్యాలు, ఇతరత్రా కారణాలతో ఈ ఏడాది మామిడి దిగుబడులు గణనీయంగా తగ్గాయి. దీనికితోడు మద్దతు ధర లేకపోవడంతో దళారులు చెప్పిన రేటుకే మామిడి కాయలు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరి నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లో ఈ నెలలో మూడు సార్లు భారీ గాలులు వీయడంతో పెద్ద ఎత్తున మామిడికాయలు నేలపాలయ్యాయి. వాటిని కొనేవారే కరువయ్యారు. ఈ పరిస్థితిలో అరకొరగా దిగుబడి వచ్చిన తోతాపురి, బేనీషా, తదితర రకాల మామిడి కాయలను కొందరు వ్యాపారులు కిలో రూ.4 నుంచి రూ.5 మాత్రమే చెల్లించి రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు. రుమానీ మామిడి కాయలను అడిగే వారు లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ.10వేలు కూడా మిగల్లేదు

ఈ ఏడాది మామిడి రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు. ఎకరా మామిడి తోటకు రూ.10 వేలు రావడం కూడా కష్టంగా ఉంటోందని రైతులు వాపోతున్నారు. మామిడిపూత సమయంలో ఎకరాకు రూ.5 వేలు నుంచి రూ.8 వేలు వరకు ఖర్చు చేసినా ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. ఎకరాకు 4 నుంచి 5 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది. దీనికి తోడు మార్కెట్‌లో మద్దతు ధర లేకపోవడంతో ఎకరాకు రూ. 5వేలు కూడా మిగిలడం లేక నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

దళారులదే రాజ్యం

పుత్తూరు మామిడి మండీలో దళారులు సిండికేట్‌గా మారి రైతులను దోచేస్తున్నారు. కిలో మామిడి కాయలను రూ.5కి కొనుగోలు చేసి ఫ్యాక్టరీ యాజమాన్యానికి రూ.40కి అమ్ముకొంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో నగరి నియోజకవర్గం పరిసర ప్రాంతాల్లోని విజయపురం, నగరి, పుత్తూరు, నింద్ర, వడమాలపేట మండలాలకు చెందిన మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

కిలో రూ. 5 పలుకుతోంది



నాకు రెండు ఎకరాల్లో మామిడి తోట ఉంది. ఈ ఏడాది పంట దిగుబడి సరిగ్గా రాలేదు. ఇటీవల వీచిన గాలులకు కాయలు నేలపాలయ్యాయి. పూత కోసం చాలా వరకు ఖర్చు చేశాను. మార్కెట్‌లో కిలో మామిడి రూ.5కి కొనుగోలు చేస్తున్నారు. ఏడాది పూర్తిగా ఖర్చు చేసిన డబ్బు కూడా రాలేదు. ఈ ఏడాది భారీగా నష్టం వచ్చింది.

–ఉమాపతి, బట్టికండ్రిగ, వడమాలపేట

దళారులు దోచేస్తున్నారు

మార్కెట్‌లో దళారులు చెప్పిందే రాజ్యం. బయట రూ.30 నుంచి రూ.40 వేలు పలుకుతున్నా రైతులకు మాత్రం రూ.5 వేలు ఇస్తున్నారు. పూత నిలబెట్టేందుకు పిచికారీ చేసిన మందులు ఖర్చు కూడా ఈ ఏడాది రాలేదు. నాలుగు ఎకరాల్లో మామిడి పంట సాగు చేశాం. ఎకరాకు సుమారు రూ.8వేలు వరకు ఖర్చు చేశాం. ఖర్చులు పోగా ఎకరాకు రూ.2 వేలు మాత్రమే మిగిలింది.

–శివరాజు, విజయపురం

భూసార పరీక్షలు తప్పనిసరి

కార్వేటినగరం: రైతులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. శుక్రవారం ఆర్కేవీబీపేట, అన్నూరు, అలాగే ఎస్ ఆర్ కండ్రిగ గ్రామంలో నిర్వహించిన రాస్ కేవీకే ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూలీల సంఖ్యను అధిగమించడానికి యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. అనంతరం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు డాక్టర్.శ్రీనివాసులు మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం రాస్ కేవీకే అందించిన వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు అధ్యక్షుడి నాగేశ్వరరాజు, యుగంధర్, చంగల్రాయులు, జనార్దన్‌రాజు, రాంబాబురెడ్డి, తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ చంద్రమౌళి, ఏఓ హేమలత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి సామాజిక తనిఖీ గ్రామసభలు

నింద్ర: మండలంలోని జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభలు నేటి నుండి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఉపాధి ఏపీఓ చంద్రశేఖర్ తెలిపారు. గ్రామ సభల ద్వారా గ్రామ పంచాయతీల్లో జరిగిన పనుల వివరాలు, జరిగిన పనులపై తనిఖీ బృందం సేకరించే వివరాలను గ్రామంలోని ప్రజలు పూర్తి సమాచారం ఇవ్వాలని కోరారు. అదే విధంగా పనులు చేసిన కూలీల వివరాలు కూడా పూర్తి సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామసభల్లో ప్రజలు పాల్గొనాలని కోరారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



హోమపూజల్లో మాజీ మంత్రిని ఆశీర్వదిస్తున్న వేదపండితులు

- వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: చింతలపట్టెడ నడివీధిలోని శ్రీశరవణ వినాయక స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేక వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కుంభ కలశాలను ఆలయ ప్రదక్షిణ చేసిన వేదపండితులు ఆలయ గోపురానికి అభిషేకం చేశారు. కుంభాభిషేక జలం తమపై చల్లుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. కుంభాభిషేక అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు మహాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణలు చేశారు.ఈ వేడుకల్లో మాజీ మంత్రి ఆర్కేరోజా పాల్గొని, శవరవణ వినాయక స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులు ఆమెను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, ప్రత్యేక అర్చనలు చేసి ప్రసాదాలు అందించారు. వేదపండితులు ఆమెకు వేద ఆశీర్వచనాలు అందించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



పూజలు చేస్తున్న అర్చకులు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ వేద మంత్రాల నడుమ ధ్వజారోహణం చేశారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథ కాలక్షేపం జరిగింది. ప్రతి రోజూ రాత్రి వీధి నాటక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తులిపారు. ఇందులో భాగంగా మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ తనయుడు వైఎస్సార్ సీపీ నాయకుడు ఆనగంటి హరికృష్ణ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అతనికి ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ఆయన వెంట నియోజకవర్గ కార్యదర్శి భీమశంకర్‌రెడ్డి, చంద్రారెడ్డి ఉన్నారు.

మరాలి రైల్వే గేటు మూసివేత

పుత్తూరు: పట్టణంలో మరాలి రైల్వే గేట్ (నెంబర్ 55)ను మరమ్మతుల నిమిత్తం మూడు రోజులపాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే క్రాసింగ్ ట్రాక్ వద్ద గల చెక్‌రైల్ లెవల్ మరమ్మతుల కోసం గేటును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 6వ తేదీ రాత్రి 10 గంటల నుంచి 9వ తేదీ ఉదయం 6 గంటల వరకు రైల్వే గేటును మూసివేస్తున్నట్లు తెలిపారు. పుత్తూరు నుంచి నగరి వైపు రాకపోకలు సాగించే వాహనదారులు ఆర్డీఎం రైల్వే గేటు నెంబర్ 56 ద్వారా ప్రయాణించాలని సూచించారు. వాహనదారులు సహకరించాలని కోరారు.

పోషకాలతో మధ్యాహ్న భోజనం



నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎంఈఓ

పుత్తూరు: పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పోషకాలతో ఉండాలని ఎంఈఓ తిరుమలరాజు నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం ఎగువ కనకంపాళెం గ్రామంలో నిర్వాహకులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పోర్టిఫైడ్ రైస్ అందిస్తున్నారని, మంచి పోషకాలతో ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. వివిధ కూరగాయలు, ఆకుకూరలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోగ్రాం అసోసియేట్ సంతోషి, హెచ్‌ఎం హరినాథ్, ఉపాధ్యాయులు మణికంఠన్, చెన్నకేశవులు, పాఠశాల చైర్ పర్సన్, నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన అష్టలక్ష్మీ వేడుకలు

పుత్తూరు: పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం అష్టలక్ష్మీదేవీ పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 9 శుక్రవారాల పాటు నిర్వహించే ఈ పూజల్లో ఒక్కోవారం ఒక్కో లక్ష్మీదేవి అవతారంలో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. తొలి శుక్రవారం నాడు ఆదిలక్ష్మీ అలంకరణలో అమ్మవారిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి కొలువుదీర్చారు. ఉభయదారులుగా కరుణాకర్, శశికుమారి వ్యవహరించారు. కార్యక్రమాలను శ్రీవాసవీ వనిత సంఘ సభ్యులు జలజకుమారి, శశికుమారి, మంజుశ్రీ పర్యవేక్షించారు.

వధూవరులకు మాజీ డిప్యూటీ సీఎం ఆశీర్వాదం



లోకేష్‌రెడ్డి, రూప దంపతులను ఆశీర్వదిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి

గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరి పంచాయతీ గోవిందరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ వాసుదేవరెడ్డి మనుమడు, వైఎస్సార్ సీపీ మాజీ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి కుమారుడు లోకేష్‌రెడ్డి, వధువు రూపకు శుక్రవారం జరిగిన వివాహ వేడుకలకు రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతన దంపతులను ఆశీర్వదించారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు ఏసు కుమారుడు వరప్రసాద్, మోనిషా వివాహ వేడుకలకు హాజరై ఆశీర్వదించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని జక్కిదొన పంచాయతీ నంబాలపల్లె గ్రామంలో వైఎస్సార్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ బూత్‌కమిటీ కన్వీనర్ బోడిరెడ్డినారాయణరెడ్డి పెద్దనాన్న వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి వెంకట్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. తొలుత వెంకట్‌రెడ్డి పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్‌రెడ్డి, మండల కార్యదర్శి బొజ్జా రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, మాజీ ఎంపీటీసీలు బాబు, ధనుంజయరెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, నాయకులు దేవరాజులు రెడ్డి ఉన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఆనగంటి హరికృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి భీమశంకర్‌రెడ్డి కూడా వెంకట్‌రెడ్డికి నివాళులర్పించారు.

అభివృద్ధిలో వైఎస్సార్ సీపీకి సాటిలేరు

- రూ.30లక్షలతో భవన నిర్మాణాన్ని ప్రారంభించిన ఎంపీపీ



ఎంపీపీ నూతన గదిని ప్రారంభిస్తున్న ఎంపీపీ లతాబాలాజీ

కార్వేటినగరం: అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి సాటిలేదని ఎంపీపీ లతాబాలాజీ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో రూ.30 లక్షలు వెచ్చించి నిర్మించిన ఎంపీపీ గదిని ఎంపీడీఓ చంద్రమౌళితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లతాబాలాజీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించినది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రమేనని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం టీడీపీ కార్యకర్తలకు మాత్రమే ప్రజాధనాన్ని దోచిపెడుతోందని, ఆకలితో అలమటిస్తున్న పేద ప్రజలను విస్మరిస్తూ, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వానికి ఒక్క సంవత్సర కాలం కావస్తున్నప్పటికీ ఒక్క పథకం అందించక పోవడం దారుణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాలాజీ, వైస్ ఎంపీపీలు కార్తీక్‌రెడ్డి, మణెమ్మ, మండల కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు దేశమ్మ, మురగయ్య, శ్రీనివాసులురెడ్డి, లక్ష్మమ్మ విజయ, స్థానిక సర్పంచ్ ధనుంజయవర్మ, శేషాద్రి, శీలారాణి, మునికృష్ణ, నందగోపాల్, ప్రేమనాథరెడ్డి, లోకనాథనాయుడు పాల్గొన్నారు.

డీగ్రేడ్ చేస్తే డ్రాపౌట్స్ తప్పదు



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పుత్తూరు: ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్న తరుణంలో మోడల్ ప్రైమరీ స్కూల్ పేరిట 8వ తరగతి నుంచి 5వ తరగతికి డీగ్రేడ్ చేయడం సరికాదని, అలాచేస్తే డ్రాపౌట్స్ తప్పవని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, 24వ వార్డు కౌన్సిలర్ కె.సి.ఏకాంబరం ఆందోళన వ్యక్తం చేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈఓ తిరుమలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఏకాంబరం మాట్లాడుతూ స్థానిక కాపువీధిలోని ఎంపీయూపీ స్కూల్‌ను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని పాఠశాల అభివృద్ధి కమిటీ, పేరెంట్స్ కమిటీలు ఏకగ్రీవంగా తీర్మానం చేసి విద్యా శాఖకు నివేదించాయని గుర్తు చేశారు. అప్‌గ్రేడ్ చేయమని కోరుతుంటే డీగ్రేడ్ చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వందేళ్ల చరిత్ర కలిగిన పాఠశాలను నిర్వీర్యం చేయాలని చూస్తే ప్రజలు ఉద్యమ బాటపడుతారని హెచ్చరించారు. ప్రస్తుతం పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు 75 మంది, 6 నుంచి 8 వరకు 69 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. అలాగే 12 తరగతి గదులు, టాయిలెట్స్, ప్లేగ్రౌండ్‌తో సహా అన్ని వసతులతో ఉన్న పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఇక్కడ చదువుతున్న పిల్లలు ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు చెందిన పేద విద్యార్థులు కావడంతో దూరప్రాంతాలకు వెళ్లి చదివే పరిస్థితి లేదన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మారిస్తే మాత్రం ఎక్కువ మంది విద్యార్థులు బడిమానేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

వైభవంగా కుంభాభిషేకం

విజయపురం: శ్రీహరిపురంలో నూతనంగా నిర్మించిన శ్రీఅంకాళ పరమేశ్వరి దేవి ఆలయంలో మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కలు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగించారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ పూజలు

వడమాలపేట (విజయపురం): అప్పలాయగుంటలోని టీటీడీ అనుబంధ శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు వేదపండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున నిత్య కైంకర్యాల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం 6.30గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్య ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు పుట్ట మట్టితో మేదిని పూజ చేపట్టారు. అనంతరం సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. యాగశాలలో వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు. రాత్రి 8.30 గంటలకు శుద్ధి, ఏకాంత సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 6.55 గంటల నుంచి 7.25 గంటల మధ్య ధ్వజారోహణంతో బ్రహ్మోత్స వాలు ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాలను తిలకించడానికి విశేష సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొమ్మిది రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలతో అప్పలాయగుంటలో పండుగ వాతావరణం నెలకొంది.

సమస్యలు పునరావృతం కానివ్వొద్దు

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లతాబాలాజీ
- ఎంపీపీ ఆమోదం లేకుండా అర్హుల గుర్తింపు తగదు
- గోకులం షెడ్లు అర్హులకు అంద లేదని నిలదీసిన ఎంపీటీసీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లతాబాలాజీ

కార్వేటినగరం: మూడు నెలలకు ఒక్కసారి నిర్వహించే సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు తీసుకొచ్చే సమస్యలను పరిష్కరించడానికి సమయం లేదా.. ఇలాంటివి ఇక మీదట పునరావృతం కాకుండా చూడాలని ఎంపీపీ లతాబాలాజీ కోరారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో చేపట్టిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ లతాబాలాజీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. మూడు నెలల క్రితం చెప్పిన సమస్యను పరిష్కరించక పోవడం శోచనీయమన్నారు. అధికారులు విధి నిర్వాహణలోనే కాక సమావేశాలకు హాజరు కావడంలో సమయపాలన పాటించడం లేదన్నారు. సమావేశానికి హాజరు కాని శాఖల అధికారులకు మెమో ఇవ్వాలని ఎంపీడీఓను ఆదేశించారు. మండలంలో ఎంపీపీ ఆమోదం లేకుండా సంక్షేమ పథకాల పంపిణీలో అర్హులను గుర్తించడం దారుణమని, గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువులు లేని వారికి గోకులం షెడ్లు మంజూరు చేశారని, 8 ఆవులున్న తనకు గోకులం షెడ్డు మంజూరు కాలేదని కొల్లాగుంట ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. బట్టువారిపల్లి బోరుల్లో కలుషిత నీరు వస్తున్నాయని ఆరు నెలలు క్రితం చెప్పినా సంబంధిత అధికారులు స్పందించడం లేదని, గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారని మండల కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కృష్ణాపురం జలాశయం వద్ద పాతవస్తువులు చోరీకి గురవుతున్నాయని, వాచ్ మెన్లు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ ఏఈ రవిప్రకాష్ కోరారు. దుస్థితికి చేరుకున్న బస్సు షెల్టర్లకు రంగులు వేయించాలని కార్వేటినగరం సర్పంచ్ ధనుంజయవర్మ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ కోతలు ఎక్కువగా ఉన్నాయని, విద్యుత్ అధికారులు అందుబాటులో ఉండడం లేదని, విద్యుత్ కోతలతో గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడిందని కొటార్వేడు సర్పంచ్ శీలారాణి, ఎంపీటీసీ విజయ అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ త్యాగరాజు, ఎంఈఓ విజయకుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.